
సాక్షి
పల్నాడు
శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023




6,7 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి

తాడేపల్లిరూరల్: కొలనుకొండలో నిర్మిస్తున్న గోకుల క్షేత్రంలో ఈనెల 6,7 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు గోకులక్షేత్రం అధ్యక్షుడు వంశీధర దాస తెలిపారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 3,920 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 176 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 523.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

యార్డును సందర్శించిన మూడు రాష్ట్రాల కార్యదర్శులు




కొరిటెపాడు(గుంటూరు): తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన మార్కెటింగ్‌శాఖ సిబ్బంది, కార్యదర్శులు మూడు నెలల శిక్షణలో భాగంగా గురువారం గుంటూరులోని మిర్చి యార్డును సందర్శించారు. యార్డులో జరుగుతున్న క్రయ, విక్రయాలు.. మిర్చి యార్డుకు ఏఏ జిల్లాలు, రాష్ట్రాల నుంచి మిర్చి రైతులు తరలి వస్తారు.. ఏఏ రకాల మిర్చి వస్తుంది.. ఏఏ రకాలకు ఎంతెంత ధర లభిస్తుంది.. మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారులు ఏ విధంగా వ్యవహరిస్తారు.. రైతులకు యార్డులో కల్పిస్తున్న వసతులు, మిర్చిని కొనుగోలు చేసిన తర్వాత రైతులకు ఎన్ని రోజుల్లో డబ్బు చెల్లిస్తారు.. తదితర అంశాలపై యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డిలు వారికి వివరించారు. అనంతరం యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజానారాయణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన విధులను కార్యదర్శులు బాధ్యతగా నిర్వర్తిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని గుర్తుచేశారు. కార్యదర్శులు తీసుకునే నిర్ణయాలపై వేల కుటుంబాలు ఆధారపడి ఉంటాయని, ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మార్కెటింగ్‌శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు బి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో మహిళా ఎస్ఐ అభ్యర్థులకు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు గురువారం కొనసాగాయి. గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, ఒంగోలు పీటీసీ ప్రిన్సిపాల్ ఎ.ఆర్.దామోదర్ పోటీలను పరిశీలించారు. అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు తనిఖీ చేశారు. అనంతరం అభ్యర్థుల చాతీ, ఎత్తు కొలతలను మహిళా పోలీస్ సిబ్బంది తీసుకున్నారు. 1,600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. మహిళా అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఏఎస్పీలు కె.సుప్రజ (గుంటూరు), హైమావతి (ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు), గుంటూరు రేంజ్‌లోని కొందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, మహిళా పోలీస్ అధికార/సిబ్బంది, ఐజీ కార్యాలయపు సీఐ సుధాకర్, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

9న జాతీయ మెగా లోక్‌అదాలత్



నగరంపాలెం: గుంటూరు జిల్లాలోని ప్రతి కోర్టులో ఈనెల 9న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. జిల్లాలోని సబ్ డివిజన్ల పోలీస్ అధికారులు, పోలీస్‌స్టేషన్ల సీఐలతో గురువారం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జూమ్ వీడియో ద్వారా ఎస్పీ మాట్లాడారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వీలైనంత త్వరగా ఎక్కువ కేసులు పరిష్కరించాలని అన్నారు. జిల్లాలో ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే రాష్ట్ర డీజీపీ ఉత్తర్వుల ప్రకారం ఫామ్ నంబర్ ఒకటిని 48 గంటల్లో పూర్తి చేయాలని చెప్పారు. ఫామ్ నంబర్లు 5, 7 నిర్దేశించిన సమయంలో పూర్తి చేసి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అన్నారు. జిల్లాలో ప్రతి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన రోడ్డు ప్రమాదాల కేసుల్లో బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. స్పెషల్ గ్రీవ్, ముఖ్యమైన కేసుల్లో విచారణ అధికారులు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సంయుక్తంగా కోర్టుకు హాజరై, కేసులు వీగి పోకుండా దోషులకు కోర్టులో శిక్ష పడేలా వ్యవహరించాలని అన్నారు. ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు, ఎస్‌బీ ఇన్‌చార్జి సీఐ బాలసుబ్రమణ్యం, డీసీఆర్‌బీ సీఐ అనూరాధ, ఎస్ఐ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ముద్ద మనోహరం

- పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద
- దిగ్విజయంగా అమలు
- పక్కాగా మెనూ
- రోజూ అధికారుల పర్యవేక్షణ



నరసరావుపేట మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో గోరుముద్ద స్వీకరిస్తున్న బాలికలు

నరసరావుపేట ఈస్ట్: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన సంక్షేమ ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి నాణ్యమైన విద్యను అందించటంతోపాటు విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తూ వారి ఆరోగ్యంపైనా శ్రద్ధ తీసుకుంటోంది. ఇప్పటికే మనబడి నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులను కల్పించింది. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలనే దృఢ సంకల్పంతో మధ్యాహ్న భోజన పథకాన్ని జగనన్న గోరుముద్దగా మార్చి దిగ్విజయంగా అమలు చేస్తోంది. పోషకాహార పదార్థాలతో మెనూ రూపొందించింది. ఫలితంగా చిన్నారుల మోములో చిరునవ్వులు చిందుతున్నాయి.

పోషక బియ్యం, నాణ్యమైన గుడ్లు సరఫరా

జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వం రోజుకొక మెనూ అమలు చేస్తోంది. వారంలో ఐదు రోజులపాటు ఉడికించిన కోడిగుడ్డు అందిస్తోంది. సోమ, బుధ, శుక్రవారాల్లో వేరుశెనగ చిక్కీ, మంగళ, గురు, శనివారాల్లో రాగిజావ అందిస్తోంది. పాఠశాలలకు నాణ్యమైన గుడ్లు సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. పోషక విలువలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇది చిన్నారుల్లో రక్తహీనతను తొలగించడంతోపాటు నాడీ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తోంది. ఈ ఫోర్టిఫైడ్ బియ్యానికి ప్రభుత్వం కేజీకి రూ.39.35 వెచ్చిస్తోంది.



జిల్లాలోని పాఠశాలలు ఇలా..	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	మొత్తం
పాఠశాలల సంఖ్య	1,167	157	209	1,533
విద్యార్థుల సంఖ్య	58,334	16,356	75,917	1,50,607

1,15,000 గోరుముద్ద స్వీకరిస్తున్న విద్యార్థులు

2,888 వంట ఏజెన్సీల సిబ్బంది

రోజువారీ మెనూ ఇలా..

వారం	పెట్టే ఆహారం
సోమవారం	హాట్ పొంగల్ / ఎగ్ కర్రీతో వెజ్ పలావ్, చిక్కీ
మంగళవారం	దొండకాయ చట్నీతో చింతపండు పులిహోర, రాగిజావ
బుధవారం	బంగాళదుంప కూర్మాతో వెజిటబుల్ రైస్, చిక్కీ
గురువారం	సాంబార్ అన్నం / టమాటో చట్నీతో లెమన్ రైస్, రాగిజావ
శుక్రవారం	పప్పు, ఆకుకూరలతో అన్నం, చిక్కీ
శనివారం	ఆకుకూరలతో వెజిటబుల్ రైస్, రాగిజావ

(సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజూ గుడ్డు అందిస్తారు)

వంట చార్జీల పెంపు

వంట ఏజెన్సీలకు చెల్లించే చార్జీలనూ ప్రభుత్వం పెంచింది. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి గతంలో రూ.5.40 ఉండగా ప్రస్తుతం రూ.5.80కి పెంచింది. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు గతంలో రూ.7.85 ఉండగా, ప్రస్తుతం రూ.8.57కు పెంచింది. దీంతో వంట ఏజెన్సీల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

పారదర్శకత.. పర్యవేక్షణ..

గోరుముద్ద అమలు బాధ్యతను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. వీరు రోజూ ఆహారపదార్థాల నాణ్యతపై పర్యవేక్షణ చేస్తున్నారు. పేరెంట్ కమిటీ సభ్యులూ రోజూ పాఠశాలలకు వచ్చి పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్నారు. పారదర్శకంగా పథకాన్ని అమలు చేస్తున్నారు. మండల విద్యాశాఖాధికారి కూడా రోజూ తమ పరిధిలోని ఓ పాఠశాలను సందర్శించి నాణ్యతను పరిశీలిస్తున్నారు. అలాగే సచివాలయ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్ రెండు రోజులకు ఒకసారి, గ్రామ కమిటీ ప్రతినిధులు ప్రతినెలా రెండువిడతలుగా పాఠశాలలను సందర్శించి గోరుముద్ద పంపిణీ, నాణ్యతను పర్యవేక్షించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.

విద్యార్థుల సంఖ్య పెరిగింది



పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద అమలు నేపథ్యంలో మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరిగింది. పోషకాహారం అందిస్తుడడంతో పిల్లలను బడుల్లోనే భోజనం చేసేలా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. ఎంఈఓలు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ పర్యవేక్షణలో నాణ్యతలో రాజీ పడకుండా పథకాన్ని అమలు చేస్తున్నాం.

– కె.శామ్యూల్, జిల్లా విద్యాశాఖాధికారి

ఎంతో బాగుంది



పాఠశాలలో మధ్యాహ్నం పెడుతున్న జగనన్న గోరుముద్ద ఎంతో బాగుంటుంది. నేను రోజూ బడిలోనే భోజనం తింటున్నాను. దీనికోసం ప్రత్యేకంగా భోజనశాల షెడ్ ఏర్పాటు చేశారు. నీటి సౌకర్యం కూడా బాగుంది. జగన్ మామయ్యకు థ్యాంక్స్.

– వేముల భువనేశ్వరి, 8వతరగతి, మున్సిపల్ బాలికోన్నత పాఠశాల

గుడ్డు, రాగిజావ ఇస్తున్నారు



ప్రభుత్వ మెనూ ప్రకారమే భోజనం పెడుతున్నారు. ఆరు రోజులు గుడ్డు అందిస్తున్నారు. మూడు రోజులు రాగిజావ ఇస్తున్నారు. మరో మూడు రోజులు వేరుశెనగ చిక్కీ అందిస్తున్నారు. ఆనందంగా ఉంది.

– పిట్టా ప్రసన్నకుమార్, 10వతరగతి, జెడ్పీ హైస్కూల్, కొత్తపల్లి, రొంపిచర్ల మండలం

శుచిగా.. రుచిగా..



రోజూ మధ్యాహ్నం విద్యార్థులకు జగనన్న గోరుముద్దను శుచిగా.. రుచిగా అందిస్తున్నాం. నాతోపాటు ప్రతిరోజూ ఒక రిద్దరు ఉపాధ్యాయులు గోరుముద్ద పంపిణీని పర్యవేక్షిస్తుంటాం. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులతోపాటు స్థానికంగా ఉన్న విద్యార్థులూ గోరుముద్దను స్వీకరిస్తున్నారు. దాదాపు 95శాతం విద్యార్థులు గోరుముద్ద తింటున్నారు.

– తిరుమలశెట్టి మాధవి, హెచ్ఎం, జెడ్పీ హైస్కూల్, కొత్తపల్లి

గుంటూరు-బీబీనగర్ లైన్ డబ్లింగ్‌పై దృష్టి

డీఆర్ఎం ఎం.రామకృష్ణ



లక్ష్మీపురం(గుంటూరు): గుంటూరు-బీబీనగర్ లైన్ డబ్లింగ్ పనులపై దృష్టి సారించాలని డీఆర్ఎం ఎం.రామకృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో గురువారం డీఆర్‌యుసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు రైల్వే డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించేందుకు డివిజన్ సిబ్బంది, అధికారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. డివిజన్ పరిధిలో చేపట్టే నూతన అభివృద్ధి పనులకు కేంద్రం ఇప్పటికే నిధులు కేటాయించిందన్నారు. నూతన పనులను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. రైళ్లలో సరుకు రవాణా, డివిజన్ ఆదాయాన్ని పెంచడానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. రైల్వేస్టేషన్‌లలో కోచ్ ఇండికేషన్ బోర్డులు, లిఫ్టులు, రైళ్ల ఆగిపోవడం, కొత్త రైళ్లను ప్రవేశపెట్టడం, స్టేషన్‌లలో పార్కింగ్ సౌకర్యం, పరిశుభ్రత, రైల్వే పోలీసుల భద్రత గురించి చర్చించారు. సమావేశంలో ఏడీఆర్ఎం, డీఆర్‌యుసీసీ చైర్మన్ ఆర్.శ్రీనివాస్, సీనియర్ డీసీఎం, డీఆర్‌యుసీసీ బ్రాంచ్ కార్యదర్శి ఎం.దినేష్‌కుమార్, సీనియర్ డీఓఎం పి.కిరణ్, డివిజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,500, గరిష్ట ధర రూ.4,500, మోడల్ ధర రూ.3,500 వరకు పలికింది.

పశుసంరక్షణకు భరోసా

- నరసరావుపేటలో పశువ్యాధుల నిర్ధారణ జిల్లా కేంద్రం
- రోగాల నివారణకు మందులు అందజేత
- పల్నాడు జిల్లాలో ఆరు ల్యాబ్‌ల ఏర్పాటు
- ఒక్కో ల్యాబ్‌లో ప్రతి నెలా 200 పరీక్షల నిర్వహణ



నరసరావుపేటలో పశు రక్త పరీక్ష చేస్తున్న టెక్నీషియన్



సత్తెనపల్లిలోని ల్యాబ్

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుకు అండగా నిలిచింది. పశుపోషణకు భరోసా కల్పిస్తూ పశుసంవర్ధకశాలల్లో మరో విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో పశువులకు సంక్రమించే వ్యాధులను నిర్ధారిస్తూ వాటి నివారణకు చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో చాలా మంది రైతులు వ్యవసాయంతోపాటు పాడిపరిశ్రమ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వ్యాధులు సంక్రమించిన సమయంలో విలువైన పశు సంపదను కోల్పోతున్నారు. రైతులు నష్టపోకుండా ప్రతి నియోజకవర్గంలో పశువులకు సోకే వ్యాధుల నిర్ధారణకు ప్రయోగశాలలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఒక్కో నియోజకవర్గంలో పశుసంవర్ధకశాలల వద్ద ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసింది. ప్రతి ల్యాబ్‌లో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పర్యవేక్షణలో ల్యాబ్ టెక్నీషియన్లు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆయా నియోజకవర్గాలోని అన్ని పశువైద్యశాలల నుంచి అందే నమూనాల పరీక్షలు చేసి నివేదికలు ఆయా నియోజకవర్గ ఏడీలకు అందజేస్తున్నారు. సకాలంలో పశువులకు సోకే వ్యాధులను గుర్తించి మందులను అందజేస్తుండటంతో మరణాలు తగ్గి పశు సంపద వృద్ధి చెందుతోంది.

నెలలో 150 నుంచి 200 పరీక్షలు

పల్నాడు జిల్లాలో మొత్తం ఏడు నియోజకవర్గాలు ఉండగా జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో పశు వ్యాధుల నిర్ధారణ జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఆరు ల్యాబ్‌లు ఉన్నాయి. ఇవి 2021 జూన్ 8న అందుబాటులోకి వచ్చాయి. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, తది తరాలకు సంక్రమించే వ్యాధులపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి ల్యాబ్‌లో నెలకు 150 నుంచి 200 వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ప్రతినెలా లక్ష్యం మేరకు పరీక్షలు చేస్తున్నారు. పశువుల మూత్రం, పేడ, చర్మ సమస్యలకు సంబంధించిన నమూనాలను ప్రయోగశాలల్లో పరీక్షించి వ్యాధి లక్షణాలు గుర్తిస్తున్నారు. వీటితోపాటు పశువులకు పలు రకాల టీకాలు వేశాక వాటి పనితీరు, పశువుల్లో ఏవైనా వైపరీత్యాలు సంభవిస్తే వాటిని పరిశీలించడం వంటి ప్రయోగాలు కొనసాగుతున్నాయి. అలాగే పశువుల నుంచి మనషులకు సంక్రమించే వ్యాధులను గుర్తించడం జరుగుతోంది. బ్రూసెల్ (పునరుత్పత్తి లేకపోవడం) వ్యాధిని గుర్తించడం, యాంటీబయోటిక్ నిర్ధారణ పరీక్షలు, పాలు, రక్తనమూనాలు సేకరించి ఏయే రకాల యాంటీబయోటిక్ మందులు ఇస్తే పశువుకు నయమవుతుందో గుర్తించడం, వ్యాధులబారిన పడి మృతి చెందిన పశువులకు పోస్టుమార్టం తదితర పరీక్షలు నిర్వహిస్తున్నారు.

పల్నాడు జిల్లాలో పశు పరీక్షలు ఇలా...

నియోజకవర్గం	23 ఏప్రిల్ నుంచి జూలై వరకు
నరసరావుపేట	3,828
చిలకలూరిపేట	666
సత్తెనపల్లి	917
క్రోసూరు	859
గురజాల	788
వినుకొండ	862
మాచర్ల	956

బ్రూసెల్ వ్యాధి అంతమే లక్ష్యం



బ్రూసెల్ అనే వ్యాధిని 2030 నాటికి అంతం చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. దీంతో ఆ వ్యాధి నివారణకు 4 నుంచి 8 నెలల వయసు పెయ్య దూడలకు టీకాలు వేయిస్తున్నాం. ప్రయోగశాలల ఏర్పాటు రైతులకు ఎంతో ఉపయోగకరం. ల్యాబ్‌ల వల్ల పశువ్యాధులు సకాలంలో గుర్తించి మందులు అందజేస్తున్నారు. పశువుల మరణాలు తగ్గి పశు సంపద వృద్ధి చెందుతోంది.

– డాక్టర్ ఎస్.కళావతి, పశువ్యాధి నివారణ సహాయ సంచాలకులు, పల్నాడు

ఒక్కో ప్రయోగశాలకు రూ.2 లక్షలు

గొర్రెలు, మేకలకు సోకే నట్టల నిర్ధారణ, నివారణకు తగిన మందులు ఇచ్చే ప్రయోగాలు కొనసాగుతున్నాయి. అలాగే కోళ్లకు సంక్రమించే వ్యాధులను సైతం ఈ ప్రయోగశాలల్లో గుర్తిస్తున్నారు. ప్రతి ఏటా ప్రయోగాల కోసం ఉపయోగించే రసాయన ద్రావణాలు, ఇతర పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం ఒక్కో ప్రయోగశాలకు రూ.2 లక్షల నిధులు కేటాయిస్తోంది.

పథకాలను రైతు సంఘాలు అందిపుచ్చుకోవాలి

కలెక్టర్ శివశంకర్ లోతేటి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట రూరల్: ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు అభివృద్ధి చెందాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, నాబార్డు ద్వారా అమలవుతున్న పథకాలపై కలెక్టర్ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. నాబార్డు ద్వారా అమలవుతున్న వాటర్‌షెడ్, మా తోట గిరిజన అభివృద్ధి పథకాలతోపాటు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాలు, పొదుపు గ్రూపు మహిళలు, యువతకు శిక్షణ కార్యక్రమాలపై సమీక్షించారు. కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల సమన్వయంతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ముందుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న మార్కెటింగ్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీసీఆర్‌సీ కార్డులు రైతులకు అందించేందుకు సంఘాలు చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రతి నెలా రెండో మంగళవారం అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటుచేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి బెన్నీ, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి నాగశ్రీనివాస్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమృతలింగేశ్వరుడికి వెండి కవచం



జగ్గయ్యపేట: మండలంలోని ముక్త్యాల గ్రామంలో వేంచేసిన కోటిలింగ హరిహర మహాక్షేత్రంలో కొలువైన అమృతలింగేశ్వరుడికి దాతలు గురువారం వెండి కవచం అందజేశారని ఈఓ శిరీష తెలిపారు. జగ్గయ్యపేటకు చెందిన విజయలక్ష్మి దంపతులు రూ.లక్ష వెచ్చించి సుమారు కిలో వెండితో తయారు చేసిన కవచాన్ని అందజేశారు. దాతలకు స్వామి వారి ప్రసాదాలు అందించి, శేషవస్త్రంతో సత్కరించారు.

రూ.90.09 లక్షలకు కొబ్బరి చెక్కల టెండర్



సీల్డ్ టెండర్ బాక్స్‌ను తెరుస్తున్న అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు సమర్పించిన కొబ్బరి చెక్కలను పోగు చేసుకునే హక్కు టెండర్‌ను అమృత ట్రేడర్స్ రూ.90,09,999లకు దక్కించుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఆరో అంతస్తులో ఏఈఓ చంద్రశేఖర్ పర్యవేక్షణలో గురువారం ఈ టెండర్ ప్రక్రియ కొనసాగింది. బహిరంగ వేలం, సీల్డ్ టెండర్, ఈ-టెండర్ విధానం ద్వారా ఈ ప్రక్రియను నిర్వహించారు. విజయవాడకు చెందిన అమృత ట్రేడర్స్, శ్రీనివాస స్టోర్స్, ఎం.విజయ్‌చంద్ సప్లయర్స్ ప్రతినిధులు రూ.5 లక్షలు ప్రథమ ధరావత్తుగా చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొన్నారు. దేవస్థానం పాటను రూ.85 లక్షలుగా నిర్ణయించి వేలాన్ని ప్రారంభించింది. బహిరంగ మార్కెట్‌లో కొబ్బరి ధర లేకపోవడంతో అంత మొత్తానికి తాము పాట కొనసాగించలేమని కాంట్రాక్టర్లు చెప్పడంతో దేవస్థానం పాటను రూ.80 లక్షలకు తగ్గించింది. అనంతరం కాంట్రాక్టర్లు పాటను క్రమంగా రూ.86 లక్షల వరకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి పాట ముందుకు వెళ్లకపోవడంతో అధికారులు సీల్డ్ టెండర్ బాక్స్‌ను తెరిచారు. సీల్డ్ టెండర్ బాక్స్‌లో అమృత ట్రేడర్స్ రూ.90,09,999లకు కోట్ చేసింది. దీంతో అమృత ట్రేడర్స్ అత్యధిక మొత్తానికి పాటను దక్కించుకున్నట్లు అధికారులు ప్రకటించారు. వేలం వివరాలతో ఆలయ ఈఓ భ్రమరాంబకు నివేదిక ఇస్తామని, ఆ తర్వాత దేవదాయ శాఖ కమిషనర్ అనుమతికి వెళ్తుందని, అక్కడ ఆమోదం పొందిన తర్వాతే పాటను ఖరారు చేస్తామని అధికారులు తెలిపారు. ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

రేపు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల వార్షిక సమావేశాన్ని శనివారం ఉదయం 9 గంటలకు గుంటూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు డీఈఓ పి.శైలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆడుదాం ఆంధ్ర, జోనల్ క్రీడల నిర్వహణపై నిర్వహిస్తున్న వార్షిక సమావేశానికి అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను పంపాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలను ఆదేశించారు.

పచ్చదనం పెంపునకు చర్యలు

జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ శివశంకర్ లోతేటి, అటవీ శాఖ అధికారి రామచంద్రరావు, అధికారులు

నరసరావుపేట రూరల్: జిల్లాలో పచ్చదనం పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం కలెక్టర్ శివశంకర్ లోతేటి అధ్యక్షతన జిల్లా ఫారెస్ట్రీ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.రామచంద్రరావు, డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి బెన్ని, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు మాట్లాడుతూ 2022–23 సంవత్సరంలో 12 లక్షల మొక్కలు నాటే లక్ష్యం కాగా 14.04లక్షల మొక్కలను నాటినట్లు తెలిపారు. 2023–24సంవత్సరానికి 68లక్షలు అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ల ద్వారా మొక్కలు నాటేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. సామాజిక అటవీశాఖ, టెర్రిటోరియల్ ద్వారా 15లక్షలు మొక్కలు పెంచేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికుడు అంకారావు పాల్గొని విత్తన బంతులను తయారుచేసి, అటవీ ప్రాంతంలో చల్లటంలో తన అనుభవాలను తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, ఐటీసీ మేనేజర్లు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల హక్కులపై అవగాహన అవసరం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ రూపొందించిన మహిళల హక్కులపై అవగాహన అవసరం అనే కరపత్రాన్ని గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, సమాజంలో ప్రతిఒక్కరూ బాలికలు, మహిళల పట్ల బాధ్యతగా నడుచుకోవాలని సూచించారు. మహిళల హక్కుల పరిరక్షణకు ఉన్న చట్టాలను తెలుసుకోవటం ద్వారా రక్షణ పొందవచ్చని వివరించారు. కరపత్రాన్ని రూపొందించిన హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు. కరపత్రాలను అంగన్‌వాడీ కేంద్రాలు, డ్వాక్రా, పొదుపు సంఘాలు, కళాశాల, పాఠశాలల విద్యార్థినులకు అందించి చట్టాలపై వారికి అవగాహన కలిగేలా చేయాలని సూచించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు మురళి, నాని పాల్గొన్నారు.

రెడ్డి జేఏసీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా అనురాధారెడ్డి

నరసరావుపేట రూరల్: రెడ్డి జేఏసీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా సీహెచ్ అనురాధారెడ్డి నియమితులయ్యారు. విశాఖపట్నంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రెడ్డి జేఏసీ గౌరవ అధ్యక్షుడు పాలిమేర వెంకటరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు విప్పల శివకుమార్‌రెడ్డి, చేతుల మీదగా నియామకపత్రాన్ని అనురాధారెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా అనురాధారెడ్డి మాట్లాడుతూ జేఏసీ మహిళా విభాగం బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు.

నియామకపత్రాన్ని అందుకుంటున్న అనురాధారెడ్డి →



బ్యాంకు అప్రైజర్ చేతివాటం

- కుదవబెట్టిన 304 గ్రాముల బంగారంతో ఉడాయించిన వైనం
- నిఘా కెమెరాల ద్వారా గుర్తించిన బ్యాంకు అధికారులు
- అలాగే బినామీ పేర్లతో నకిలీ బంగారం తాకట్టు పెట్టిన వైనం
- రూ.65 లక్షలకు పైగా బ్యాంకుకు టోకరా పెట్టిన ఘనుడు
- యద్దపాడు యూనియన్ బ్యాంకులో ఘటన



యూనియన్ బ్యాంక్ యద్దపాడు శాఖ

యద్దపాడు: ఖాతాదారులు తనఖా పెట్టిన బంగారంతో బ్యాంక్ అప్రైజర్ ఉడాయించిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. బ్యాంకు – ఖాతాదారులకు మధ్య వారధిలా ఉండాల్సిన వ్యక్తి మోసానికి పాల్పడిన విషయాన్ని గుర్తించి అప్రమత్తమైన బ్యాంకు అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. యద్దపాడు గ్రామంలోని యూనియన్ బ్యాంక్‌లో జరిగిన ఈ సంఘటనపై బ్యాంక్ మేనేజర్ ఇచ్చిన ప్రాథమిక సమాచారం మేరకు.. బాపట్ల జిల్లా చీరాల సమీపంలోని పూసపాడు గ్రామానికి చెందిన స్వర్ణకార వృత్తిని నిర్వహించుకునే నిడమానూరి హరీష్ కుటుంబం యద్దపాడుకు వలస వచ్చింది. గత 9 ఏళ్లుగా ఆంధ్రబ్యాంక్ యద్దపాడు శాఖలో అప్రైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం బ్యాంకులో ఏడుగురు ఖాతాదారులు సుమారు 304 గ్రాములు బంగారాన్ని కుదవ పెట్టారు. మధ్యాహ్నం భోజనానికి వెళ్లిన అప్రైజర్ ఎంతకూ విధులకు రాలేదు. దీంతో బ్యాంక్ మేనేజర్‌తో పాటు సిబ్బంది ఫోన్లు చేసినా స్విచ్‌ఆఫ్ అయింది. ఇంటికెళ్లిన అప్రైజర్ తిరిగి రాకపోవడం, సెల్ స్విచ్‌ఆఫ్ కావడం, బ్యాంకులోనూ బంగారం కనిపించపోవడంతో అనుమానంతో నిఘా కెమెరాలను పరిశీలించారు. ఆ బంగారాన్ని సదరు అప్రైజరు జేబులో పెట్టుకోవడం బ్యాంక్ అధికారులు సీసీ కెమెరా ఫుటేజీల్లో గుర్తించి వెంటనే బ్యాంక్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారి సూచనల మేరకు బ్యాంక్ అధికారి పోలీసులను ఆశ్రయించారు.

అన్ని గోల్డ్‌ఖాతాల పరిశీలన...

జరిగిన విషయం తెలుసుకున్న బ్యాంక్ ఉన్నతాధికారులు యద్దపాడు శాఖకు చేరుకుని, సేఫ్ లాకర్‌లో ఉంచిన బంగారం, వాటిని తనఖా పెట్టిన ఖాతాదారులు వివరాలపై ఆడిట్ నిర్వహణ చేపట్టారు. మొత్తం 1886 గోల్డ్ ఖాతాలు యద్దపాడు శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని బుధ, గురువారాల్లో 500 ఖాతాలను పరిశీలన చేశారు. వీటిలో 30 ఖాతాలలో హరీష్ వేరువేరు పేర్లతో తాకట్టు పెట్టి రూ.40 లక్షలు డబ్బులు తీసుకున్నట్లు.. ఆయా ఖాతాల్లో ఉంచినదంతా నకిలీ బంగారమేనని ఆడిట్ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ప్రాథమిక సమాచారం పోలీసులకు అందించినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో ఆడిట్ నిర్వహించాక పూర్తి సమాచారం పోలీసులకు అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఖాతాదారులు ఆందోళన చెందవద్దు..

తమ శాఖలో బంగారం కుదువ పెట్టిన ఖాతాదారులకు సంబంధించిన బంగారం అంతా బ్యాంకులోనే భద్రంగా ఉందని బ్యాంక్ అధికారులు మీడియాతో చెప్పారు. అనవసరపు పుకార్లు నమ్మవద్దని, తమ ఖాతా స్లిప్పులతో వస్తే వారు తాకట్లు పెట్టిన బంగారం చూపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఆర్‌బీకేలను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



రైతులతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

ఈపూరు: రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటున్నాయని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఈపూరులో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ రైతులతో సమావేశమై చర్చించారు. రైతులు తమకు వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు రాయితీపై కావాలని ఎంపీ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన మంత్రితో ఈ విషయంపై చర్చించి పనిముట్లు రాయితీపై వచ్చేలా చూస్తామన్నారు. ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పలు సేవలను ప్రతిఒక్క రైతు సద్వినియోగంచుకోవాలని సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ఆర్.రామారావు, ఉద్యానవన శాఖ అధికారులు డి.నవీన్‌కుమార్, ఎస్‌కే నబీ రసూల్, వ్యవసాయ సహాయకుడు ఎం.శేషబాబు, రైతులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు 342 మంది హాజరు

పర్చూరు (చినగంజాం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బీఏఆర్ అండ్ టీఏ జూనియర్ కాలేజీలో గురువారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 342 మంది హాజరయ్యారు. మొత్తం హాజరైన వారిలో 85 మందికి ఉద్యోగాలకు ఎంపికయ్యారని బాపట్ల జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఈ. తమ్మాజీరావు తెలిపారు. జాబ్‌మేళాకు అపెక్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్, మాల్‌టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హెటిరో డ్రగ్స్, ఫ్లెక్స్ టెక్ సొల్యూషన్స్, ఐసీఐసీఐ, సీఈటీసీ రెన్యూవబుల్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, అమర రాజా బ్యాటరీస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఫస్ట్ సోర్స్, హీరో మోటో కార్ప్ వంటి 11 కంపెనీలకు పైగా ప్రముఖ బహుళజాతి కంపెనీలు హాజరయ్యాయని చెప్పారు. జీతం వారి విద్యార్హతలను బట్టి రూ.10 వేలు నుంచి రూ. 35 వేలు వరకు ఉంటుందని తెలిపారు. జిల్లా ఉపాధి అధికారి రాజారావు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఒక సువర్ణ అవకాశమని పేర్కొన్నారు. యంగ్ ప్రొఫెషనల్ హారిక సొగంధి, మల్లీశ్వరి, ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ నాగ వెంకట్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి ప్రత్యేక చర్యలు

బాలల హక్కుల కమిటీ సభ్యురాలు పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతి

వేటపాలెం: అధికారులంతా సమన్వయంతో పనిచేస్తూ బాల్య వివాహాల నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి సూచించారు. మండలం పరిషత్ సమావేశ హాలులో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు–అనర్థాలపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో బాలల హక్కుల్ని కాపాడడంలో రాష్ట్రం ఐదో స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో అనంతపురం ఒకటో స్థానం, ప్రకాశం జిల్లా రెండో స్థానంలో ఉందని తెలిపారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. తల్లిదండ్రుల నిరక్షరాస్యతతో పాటు లింగవివక్ష కారణంగా ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిపారు. వీటిని ముందుగానే గుర్తించి అరికట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. బాల్య వివాహాల వల్ల అనారోగ్యంతో పాటు అనర్థాలు చోటు చేసుకుంటాయని పేర్కొన్నారు. చదువుకొనే వయసులో బలవంతంగా వివాహం చేయడం వల్ల వారి బంగారు భవిష్యత్ అంధకారంగా మారుతుందని తెలిపారు. ఇటువంటి వాటిపై కఠినంగా వ్యవహరించి, అవసరమైతే కేసులు నమోదు చేయాలని పద్మావతి సూచించారు. విద్యాశాఖ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు డ్రాపవుట్లను గుర్తించి వారిని బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమ, వైద్యాధికారి శ్యాంసన్, డాక్టర్ బాలరాజు, ఎంఈవో సుబ్బయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలవెలబోయిన యువగళం సంఘీభావ యాత్ర

- యాభై మంది కూడా లేని ర్యాలీ
- నిరుత్సాహంతో మాట్లాడకుండానే వెళ్లిపోయిన టీడీపీ ఇన్‌చార్జి



జనం లేక వెలవెలబోతున్న సభ

చీరాల: టీడీపీ నాయకుడు నారా లోకేష్ యువగళం 200 రోజులు పూర్తి చేసుకున్నందున టీడీపీ నేతలు చీరాల్లో చేపట్టిన సంఘీభావ యాత్రలు కార్యకర్తలు, నాయకులు లేక వెలవెలబోయింది. చీరాల టీడీపీ ఇన్‌చార్జి ఎం.ఎం. కొండయ్య ఆధ్వర్యంలో గురువారం రాత్రి నియోజకవర్గ స్థాయిలో చేపట్టిన సంఘీభావ యాత్రకు టీడీపీ నాయకులు, కార్యకర్తల నుంచి కనీస స్పందన రాలేదు. ర్యాలీ కోసం ఈపురుపాలెం నుంచి పందిళ్లపల్లి వరకు జోరుగా ప్రచారం చేసినప్పటికీ కనీసం 50 మంది కూడా యాత్ర, సభకు హాజరు కాలేదు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే గడియార స్తంభం సెంటర్‌లో టీడీపీ సభకు స్పందన లేకపోవడంతో నాయకులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. పెద్దఎత్తున ప్రచారం చేపట్టి వాహనాల రాకపోకలు బైపాస్‌లోకి మళ్లించినప్పటికీ కనీసం సభకు జనం లేకపోవడంపై అంతా నవ్వుకున్నారు. బహిరంగ సభలో జనం లేకపోవడం, కార్యకర్తల నుంచి స్పందన లేకపోవడంతో మాట్లాడకుండానే ఆ పార్టీ ఇన్‌చార్జి కొండయ్య మైక్ ఇచ్చేసి వెళ్లిపోయారు. జాతీయ పార్టీ అని చెప్పుకునే టీడీపీకి చీరాల్లో కార్యకర్తలు, నాయకులు లేరని ప్రజలు బహిరంగానే నవ్వుకున్నారు.

జీజీహెచ్‌లో రూ. 40 లక్షలతో స్టెప్ డౌన్ ఐసీయూ



స్టెప్ డౌన్ ఐసీయూ పనులు పర్యవేక్షిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ రూ. 40 లక్షలతో అధునాతన వెంటిలేటర్‌లతో స్టెప్‌డౌన్ ఐసీయూను అభివృద్ధి చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. గురువారం ఆసుపత్రిలోని స్టెప్ డౌన్ ఐసీయూ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద రోగుల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తూ నిధులు విడుదల చేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా జీజీహెచ్‌లో వెంటిలేటర్ ఐసీయూను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అత్యవసర వైద్య విభాగానికి అనుబంధంగా స్టెప్‌డౌన్ ఐసీయూను నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ప్రోత్సాహంతో, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. కొత్తగా నిర్మిస్తున్న ఐసీయూలో ప్రతి బెడ్‌కు వెంటిలేటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణ బాబు ఆసుపత్రి అభివృద్ధి కోసం రూ.5 కోట్లు కేటాయించారన్నారు. అందులో రూ.40 లక్షలు స్టెప్ ఐసీయూ కోసం ఖర్చు పెడుతున్నామని వెల్లడించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేసి సెప్టెంబర్ మసానికి అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ఎస్ శ్రీనివాస ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, సమీనా బేగం పాల్గొన్నారు.

రేపు ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ స్నాతకోత్సవం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి రూరల్ పరిధి నీరుకొండలోని ఎస్ఆర్ఎం వర్శిటీ 3వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు వర్శిటీ చాన్స్‌లర్ డాక్టర్ టీఆర్ పారివేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సెప్టెంబర్ 2న నిర్వహించే యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై విచ్చేయనున్నారని, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రెసిడెంట్, మాజీ డీఎస్‌డీ సెక్రటరీ డాక్టర్ అశుతోష్ శర్మకు గౌరవ డాక్టరేట్ అందజేయనున్నామని, అదేవిధంగా 883 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు డిగ్రీలు, మెడల్స్ తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా ప్రదానం చేయనున్నామని తెలిపారు.

నేటి నుంచి మండల స్థాయిలో క్రీడా ఎంపికలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2023–24 విద్యాసంవత్సరానికి శుక్రవారం నుంచి ఈనెల 5వ తేదీ వరకు మండలస్థాయిలో క్రీడా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ, స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి. ప్రతాప్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఈనెల 6వ తేదీ నుంచి 10 వరకు నియోజకవర్గ స్థాయిలో క్రీడా ఎంపికలను పూర్తి చేయాలని సూచించారు. కబడ్డీ, ఖో–ఖో, టెన్నికాయిట్, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్‌లలో మండల, నియోజకవర్గస్థాయిలో క్రీడా ఎంపికలకు తగు ఏర్పాట్లు చేసుకుని, సకాలంలో ఎంపికలు పూర్తి చేయాలని ఆదేశించారు. మండల, నియోజకవర్గస్థాయి ఎంపికలు పూర్తవ్వగానే జిల్లాస్థాయిలో ఆయా క్రీడాంశాలతో పాటు మిగిలిన క్రీడల ఎంపికలకు సంబంధించిన షెడ్యూల్ త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు అకడమిక్ మానిటరింగ్‌లో విధిగా నమోదు చేసుకోవాలని, ఆ విధంగా చేయని క్రీడాకారులను ఎంపిక చేయబోమని స్పష్టం చేశారు. అండర్–11, అండర్–14, అండర్–17 విభాగాల వారీగా పాల్గొనాలని సూచించారు.

డీ-13 విద్యుత్ శాఖ కార్యాలయం మార్పు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ డీ–13 నూతన కార్యాలయం నవ భారత్‌నగర్ 1వలైనులోకి మార్చినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసబాబు గురువారం తెలిపారు. గతంలో ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చినట్లు వెల్లడించారు. 1, 2, 57 వార్డులు డీ–13 సెక్షన్ పరిధిలోకి వస్తాయన్నారు. సీతారామ్‌నగర్, అంబేడ్కర్‌నగర్, అరుంధతీనగర్, మంగళదాస్‌నగర్, రాజగోపాలనగర్, డీఆర్టీనగర్, మద్దిరాల కాలనీ, షాప్ ఎంప్లాయిస్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఎన్టీఆర్‌నగర్, ఇజ్రాయిల్‌పేట, గాంధీనగర్, రాహుల్ గాంధీనగర్, జీయావుద్దీన్‌నగర్, నందివెలుగు రోడ్డు, నవభారత్‌కాలనీ, రాఘవ నగర్‌లు సెక్షన్ పరిధిలోకి వస్తాయన్నారు.